www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 జూన్ 2025

నేడు యథావిధిగా
'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ముసుగులో పడి మోసపోవద్దు

ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సైబర్ నేరగాళ్ల ముసుగులో పడి ప్రజలు మోసపోవద్దని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల ద్వారా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ఉండటానికి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా, గుర్తు తెలియని నంబర్ల నుండి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఎపికె ఫైల్స్, జీమెయిల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. లాటరీ తగిలిందని, బహుమతులు వచ్చాయని చెప్పే మోసపూరిత సందేశాలను నమ్మవద్దని కోరారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఎటిఎం పిన్, ఒటిపి వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, సురక్షితమైన వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని, తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సైబర్ మోసం జరిగినట్లు అనుమానం వస్తే, వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పోలీసులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి సైబర్ మోసాలను నివారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి. తేజస్విని

ప్రజాశక్తి- రాయచోటి

ముఖా ముఖి..

జిల్లాలో గిరిజనులకు, గిరిజన విద్యార్థులకు అందుబాటులో ఉండి జిల్లా గిరిజన సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా గిరిజనుల సంక్షేమ శాఖ అధికారి పి. తేజస్విని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో గిరిజనల జనాభా, గిరిజన విద్యార్థుల పాఠశాలలు, వారు వసతులు, నాణ్యమైన భోజనం ఎలా అందించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆమె వివరించారు.

జిల్లాలో గిరిజనుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల వివరాలు తెలపండి?

జిల్లాలో 12 గిరిజన గురుకుల పాఠశాలలున్నాయి. వాటిలో ఆశ్రమ 1, బాలికల 3, బాలురు 5, వసతి గృహాలు మూడు ఉన్నాయి. బాలికల 2, బాలురు 1 ఉన్నాయి.పాఠశాలలు,సంక్షేమ వసతి గృహాలు, వార్డెన్లు ప్రస్తుతం విద్యార్థుల అడ్మిషన్లు కొనసాగుతున్నాయి.

విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పూర్తి స్థాయిలో పంపిణీ చేశారా?

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,నోట్ పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు ఇతర వస్తువులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తున్నాం.

వంట మనుషులు ఎంతమంది ఉన్నారు? ఖాళీలు ఏమైనా ఉన్నాయి?

జిల్లాలో వంట మనుషులు 13 మంది పనిచేయుచున్నారు. ఖాళీ ఉన్న ప్రదేశాలల్లో అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు.

జిల్లాలో గిరిజనులు జనాభా ఎంత ?

జిల్లలో గిరిజనుల జనాభా మొత్తం 65,106 (3.835) శాతం మంది ఉన్నారు.

గిరిజనులకు ఎటువంటి సహాయం అందిస్తున్నారు ?

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆదర్వంలో జిల్లాలో డిఎజెజియుఎ కింద నాలుగు మండలాలను గుర్తించాం. పెనగలూరు మండలంలో కొండూరు చిన్నరాయ సముద్రం, కోడూరు మండలంలో అనంతరాజుపేట, రాఘవరాజుపురం, వెల్లెలవారికండ్రిగ, ఓబనపల్లి, చియ్యవరం, కోడూరు (పడమర), కోడూరు (తూర్పు), ఉప్పరపల్లి, సెట్టిగుంట,కురబలకోట ముదివేడు, మట్టివారిపల్లి కురబలకోట, తెట్టు,అనగల్లు లక్కిరెడ్డిపల్లి బ్రామహన ఎర్రగుడి, లక్కిరెడ్డిపల్లి జిల్లా కలెక్టర్, అన్నమయ్య వారి ఆధ్వర్యంలో సంబందిత జిల్లా శాఖ అధికారులతో సమన్వయంతో ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించాం.

గిరిజనులకు మౌలిక సదుపాయాలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలోని గిరిజనులకు మౌలిక సదుపాయాల కోసం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గిరిజన పాఠశాలల విద్య మెరుగుదల కోసం ఉపాధ్యాయులకు తగు సూచనలు ఆదేశించాం. రాత్రి వేళలో స్టడీ అవర్ నిర్వహిస్తున్నాం.

గిరిజనులకు, విద్యార్థులకు సలహాలు సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటు న్నారా?

గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకోసం తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. సదరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచినలు ఇచ్చాం. విద్యార్థుల, ఉపాధ్యాయుల బోధనను శ్రద్ధగా ఆలకించి బాగా చదువుతూ మంచి మార్కులతో ఉతీర్ణత సాధించవచ్చు. వసతి గృహాలకు తనిఖీ వచ్చినప్పుడు వసతి గృహాలలో విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయవచ్చు.

బలిజలకు సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాట్లాడుతున్న హరిప్రసాద్

రాజంపేట నియోజకవర్గంలో ఎన్నో దశాబ్దాలుగా బలిజలకు ఒక సముచిత స్థానం కల్పిస్తూ వస్తోందని, ప్రస్తుతం రాజంపేటలో టిడిపి బలిజలను దూరం చేసుకుంటూ ఉందని టిడిపి సీనియర్ నాయకులు బి.హరి ప్రసాద్, మోదుగుల పెంచలయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని తోట కల్యాణ మండపంలో బలిజల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. బండారు రత్న సభాపతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగువాసి పాలకొండ్రాయుడు మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజ సామాజిక వర్గం నుంచి బండారు రత్న సభాపతి, పసుపులేటి బ్రహ్మయ్య, రామచంద్రయ్య లాంటి నేతలు ఎంతోమంది ఈ నియోజకవర్గంలో వారు స్థానాన్ని నిలబెట్టుకున్నారన్నారు. ఆనాడు ఎన్‌టిఆర్ నుంచి నేటి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనూ సామాజిక న్యాయం జరిగేది అన్నారు. నేడు ఎందుకో రాయలసీమలో తప్పనిసరిగా బలిజలకు స్థానం కల్పించే వారిని పార్టీలో ఒక స్థానం అంటూ ఉంచేవారు అన్నారు. ఈ నేపథ్యంలోనే రాజంపేట నియోజకవర్గానికి ఎలాంటి సంబంధం లేని సుగువాసి కుటుంబానికి చెందిన ఆయన తనయుడు సుగవాసి సుబ్రహ్మణ్యంకు అతి తక్కువ సమయంలో రాజంపేట నియోజవర్గ టికెట్ కేటాయించారని అన్నారు. కొంతమంది కావాలనే పనిగట్టుకుని కుట్రతో అతన్ని ఓడించారని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓటమి పాలైన వ్యక్తి ఇన్‌ఛార్జిగా ఉంటారు కానీ ఇక్కడ మరోలా ఉందని అన్నారు. పార్టీ ఓటమికి కారుకులు కొందరు పార్టీలో కీలకంగా వ్యవహరించేందుకు చూస్తున్నారని అన్నారు. ఈ నియోజవర్గంలో బలిజలు ఓటర్లగా ఉండాలా అని ప్రశ్నించారు. సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని, రాజంపేట ఇన్‌ఛార్జిగా సుగవాసి బాలసుబ్రమణ్యం స్థానంలో నియోజవర్గంలోని ఆరు మండలాల్లోని స్థానిక బలిజ నేతకు పట్టం కట్టాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఒంటిమిట్ట స్థానిక నేత హరిప్రసాద్‌కు ఆరు మండలాల్లో తన పట్టు ఉందని, ఈ విషయాన్ని టిడిపి పార్టీ అధిష్టానానికి తెలిపామని అన్నారు. స్థానిక నేతలకు పార్టీ పగ్గాలు ఇస్తే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాజంపేట పట్టణ టిడిపి అధ్యక్షులుగా బలిజ నేతకే ఇవ్వాలని, మండల అధ్యక్షులుగా ఇష్టమైన సామాజిక నేతకు కేటాయించాలని తెలిపారు. రాయలసీమలోనే బలిజ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించే వారికి తమ మద్దతు ఉంటుందని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన నేతలు, ఎన్ఆర్ఐ నేత జిలకర మురళి, బండారు బాలయ్య, న్యాయవాదులు సింగంశెట్టి కృష్ణ కుమార్, వెంకటసుబ్బయ్య, కాంగ్రెస్ నేత పూల భాస్కర్, గుణకల చిన్న, కొత్తపల్లి మురళీకృష్ణ, ఉద్దండం సుబ్రహ్మణ్యం, పాకల ప్రభాకర్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహ గల రచయిత సత్తార్‌ఫైజీ

ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

సత్తార్ ఫైజీ నేటి సమాజానికి అనుగుణంగా సామాజిక స్పృహ గల అంశాలనే తీసుకుని రచనలు చేస్తున్నారని, ప్రస్తుతం ఉర్దూ భాష పరిరక్షణకు,ఉర్దూ భాష అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న 36 మంది ఉర్దూ కవుల జీవిత విశేషాలను సంక్షిప్తంగా పరిచయం చేస్తూ 'ఉర్దూ హృదయం లో తెలుగు స్వరం' అనే విశిష్ట గ్రంథాన్ని వెలువరించడం అభినందనీయమని వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం రాయలసీమ ఉర్దూ రచయితల సమైక్య ఆధ్వర్యంలో కడప నగరం సెవెన్ రోడ్స్ ద్వారకా టవర్స్ అకాడమీ కాన్ఫరెన్స్ హాల్లో సత్తార్ ఫైజీ రచించిన ఉర్దూ హృదయంలో తెలుగు స్వరం అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కవిగా,రచయితగా, అనువాదకునిగా పరిశోధకునిగా, నటునిగా బహుముఖ ప్రజ్ఞను కనపరుస్తున్న సత్తార్ ఫైజీ ఈ గ్రంథంలో ఉర్దూ భాష ఔన్నత్యానికి, అభివృద్ధికి, పరిరక్షణకు కృషి చేస్తున్న విశ్వవిద్యాలయ ఆచార్యులు, కవులు, కళాకారులు, రచయితలు, విద్యావేత్తలు, భాషావేత్తలు, పరిశోధకులు మొదలైన వారి జీవిత విశేషాలను, వారి రచనలను పరిశోధనా దృక్పథంతో రాశారన్నారు. అధ్యక్షులుగా వ్యవహరించిన ఆచార్య ఖాసిం అలీ ఖాన్ మాట్లాడుతూ సత్తార్ ఫైజీ గతంలో పిల్లల ప్రపంచం,ఉర్దూ సాహిత్య నవరత్నాలు, భక్తి – ముక్తి అనే గ్రంథాలు రాశారని జిల్లాలో కవిగా రచయితగా ఒక సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ సలీం బాష సత్తార్ ఫైజీ ఉర్దూ భాషకు చేస్తున్న సేవ గురించి కవిత రూపంలో గానం చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన అమీర్ బాబు మాట్లాడుతూ సత్తార్ ఫైజీ గత 30 ఏళ్లుగా ఎన్నో ఉర్దూ కవి సమ్మేళనాలు, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయునిగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. గౌరవ అతిథులు రఘునాథరెడ్డి, నాసర్ బాష, రజాక్ సాబ్, ఇస్తే ఖార్ జమాల్, ఉర్దూ కవులు సయీద్ ఖాన్, మహమూద్ షాహిద్, అన్వర్ హాది, సర్దార్ సాహిర్, మహబూబ్ ఖాన్, ఉపాధ్యాయులు డాక్టర్ వసీవుల్లా భుక్తి యారి, డాక్టర్ ఖాజా పీర్, గునిశెట్టి శ్రీనివాసులు, అబ్దుల్ ఖాదర్ ఖాన్ లాజక్, అహమ్మద్, అతావుల్లా అక్తర్, గౌస్ ఖాన్, ఆరిఫ్ మొదలైన వారు సత్తార్ ఫైజీ ప్రతిభా విశేషాలను కొనియాడారు. రచయిత సత్తార్ ఫైజీ ని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం వారు, ఆయన అభిమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్తార్ ఫైజీ స్నేహితులు, బంధువులు, ఉర్దూ భాషా ప్రేమికులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

పేదలకు వరం సిఎం సహాయనిధి :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు అండగా నిలుస్తుందని రాజంపేట టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట టిడిపి కార్యాలయంలో బాధిత కుటుంబానికి చేయూత అందిస్తూ వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి తిరిగి గౌరవంగా జీవనం సాగించేలా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడు తుందని అన్నారు. అనంతరం అన్నం నాగలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.81,897లు చెక్కును వారికి అందించారు. వారి కుటుంబ సభ్యులు సిఎం చంద్రబాబుకు, చమర్తి జగన్మోహన్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, రాజంపేట టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డి నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాశాఖధికారుల నిర్లక్ష్యం తగదు

- ఉమ్మడి కలెక్టర్లు జోక్యం చేసుకోవాలి
- పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టి డొనేషన్ల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, సిబిఎస్ఇ, వసతి గృహాలు, ప్లే స్కూల్స్ వంటి వాటికి అనుమతులు లేకపోయినా విద్యాసంస్థలు కొనసాగిస్తున్నారని, ఇవన్నీ విద్యాశాఖాధికారులు తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగని పిడిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. అంకన్న పేర్కొన్నారు. నగరంలోని పిడిఎస్‌యు ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రయివేట పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖధికారులైన ఆర్‌జెడి, డిఇఒ, డిప్యూటీ డిఇఒలు వత్తాసు పలుకుతున్నారని, తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణమే వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలోని ఉమ్మడి కలెక్టర్లు జోక్యం చేసుకోవాలని చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలో కడప నగరం, ప్రొద్దుటూరు, బద్వేల్, పులివెందుల, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్నా విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించి, సిబిఎస్ఇ అనుమతి లేకపోయినా, ఉన్నట్లు చెబుతూ ప్లే పాఠశాలలు గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయని తెలిపారు. వసతి గృహాలు అనుమతి లేకపోయినప్పటికీ సొంతంగా వసతి గృహాలు నిర్వహిస్తున్నారన్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు పేరుతో అధిక ధరలు విక్రయాలు జరుపుతున్న జిఎస్‌టి, విజిలెన్స్, ఎసిబి అధికారులు మామూలు మత్తులో మునిగిపోయారని ఆరోపించారు. పాఠశాలలనే తీసుకోవాలని హుకుం జారీ చేశారన్నారు. పలుమార్లు జిల్లాలో ఉన్న ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు విద్యాశాఖ అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి విచారణ కానీ, తనిఖీలు కానీ నిర్వహించలేదని మండిపడ్డారు. కనీసం విద్యాశాఖ అధికారుల కూత వేట దూరంలో ఉన్న పాఠశాలలు తనిఖీ చేసే దానికి కూడా సమయం లేదని పేర్కొన్నారు. దోపిడి అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అన్నమయ్య జిల్లా పిడిఎస్ యు నాయకులు మహేష్, కార్తీక్ పాల్గొన్నారు.

రెన్యువల్ చేసిన పత్రాలను చూపుతున్న జబ్బల శ్రీసాయి

నిబంధనలకు లోబడే స్టోన్ క్రషర్స్ నిర్వహణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ నిబంధనలకు లోబడే గాయత్రి క్రషర్స్ నిర్వహిస్తున్నామని గాయత్రి గ్రూప్స్ కంపెనీ డైరెక్టర్ జబ్బల శ్రీసాయి స్పష్టం చేశారు. ఆదివారం టిడ్కో కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004లో అప్పటి మదనపల్లె తహశీల్దార్ 3.5 ఎకరాలలో జబ్బల మీనా, జబ్బల శ్రీనివాసుల పేరిట గాయత్రి స్టోన్ క్రషర్స్ నిర్వహణకు అనుమతులు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి తాము క్రమం తప్పకుండా రెన్యువల్ చేసుకుంటూ క్రషర్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మైనింగ్ శాఖ ఇందుకు ఎన్ఒసి సైతం ఇచ్చిందన్నారు.ఈ సందర్భంగా మూడు నెలల కిందట 2029 వరకు రెన్యువల్ చేసిన పత్రాలను పాత్రికేయుల ముందు ఉంచారు.జూన్ 10న అర్ధరాత్రి కొంతమంది దుండగులు క్వారీలోకి ప్రవేశించి గాయత్రి కంపెనీకి చెందిన వాహనాలను ధ్వంసం చేసి, సిబ్బందిపై దాడి చేశారన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, మదనపల్లి డి.ఎస్.పి, తాలూకా సిఐ లకు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. పోతబోలు గ్రామ పరిధిలో రిసార్ట్, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి 7.5 ఎకరాల భూమి చేయగా ఆక్రమణ అంటూ దుష్ప్రచారం చేశారన్నారు. తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఓ స్థలాన్ని సందర్శించి, ఆక్రమణ జరగలేదని తేల్చారన్నారు. ఇప్పటికైనా జబ్బల శ్రీనివాసులు కుటుంబంపై, గాయత్రి గ్రూప్స్ ఆఫ్ కంపెనీపై అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జబ్బల కుటుంబం, గాయత్రి గ్రూప్స్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న హజ్ కమిటీ ఛైర్మన్, సభ్యులు

హజ్ యాత్రికులకు స్వాగతం పలుకుదాం

-ఎమ్మెల్యేను ఆహ్వానించిన హజ్ కమిటీ ఛైర్మన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె నియోజకవర్గం నుండి (పవిత్ర మక్కా) హజ్ యాత్రను విజయవంతంగా ముగించుకొని మంగళవారం బెంగళూరు ఎయిర్ పోర్టుకు చేరుకోనున్న యాత్రికులకు స్వాగతం పలికేందుకు ముఖ్య అతిథిగా రావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసీన్ బాషా, ఎమ్మిగనూరు టిడిపి నాయకులు ఎమ్మెల్సీ బిటి.నాయుడు ఆహ్వానించారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసానికి విచ్చేసిన వీరు ఆయనతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికులకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.హజ్ యాత్రికులు ఎలాంటి ఇబ్బంది లేకుండా యాత్రను పూర్తి చేసుకోవడం శుభ శూచకమన్నారు. హజ్ కమిటీ ఆహ్వానం మేరకు మదనపల్లి నుండి హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని వస్తున్నవారికి స్వాగతం పలికేందుకు హాజరవుతానని వెల్లడించారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్, మైనార్టీ నాయకులు షేక్ దాదు, ఇంతియాజ్, నిమ్మనపల్లి సాజిద్, టిడిపి నాయకులు ఉన్నారు.

మాట్లాడుతున్న నిర్వాహకులు చిన్ని

ప్రతినెలా 4వ ఆదివారం
ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రతినెల 4వ ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక జిఆర్‌టి పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె, పరిసర ప్రాంతాల్లో దృష్టి లోపాలు ఎదుర్కొంటున్న ప్రజలు ఈనెల 4 వ ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని, దృష్టి సమస్యలను అధిగమించాలని కోరారు. కంటిలో శుక్లం ఉన్న వారిని గుర్తించి, వారిని చెన్నైకి శంకర్ నేత్రాలయకు ఉచితంగా బస్సులో తీసుకువెళ్లి ఐఒఎల్ ఆపరేషన్లు పూర్తి చేసిన అనంతరం, తిరిగి మదనపల్లెకు చేర్చడం జరుగుతుందని వివరించారు. బెంగుళూరు రోడ్డులోని జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఈ ఉచిత కంటి పరీక్ష శిబిరం జరుగుతుందని తెలిపారు. గడచిన కొన్ని సంవత్సరాలుగా, ప్రతినెల 4వ ఆదివారం కొనసాగుతున్న ఈ కంటి వైద్య శిబిరాల ద్వారా దృష్టి లోపాలు ఎదుర్కొంటున్న వేలాది మందికి దృష్టిలోపాలు సరిచేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని మదనపల్లి నియోజక వర్గం, పరిసర మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులకు ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు చిన్ని 9440078976, 9849173171 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

8న చలో విజయవాడ

ప్రజాశక్తి-రాయచోటి : ఆగస్టు 8న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ సుమన్ పేర్కొన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ముఖ్య నాయకుల సమావేశం ఈ నెల14 వ తేదీన గుంటూరులో జరిగిందని అన్నారు. విద్యుత్ సంస్థలో గత రెండు శతాబ్దాలుగా వెట్టి చాకిరి చేస్తూ సంస్థ పేరుకు కృషి చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను సంస్థలోకి విలీనం చేసుకొని వారిని రెగ్యులర్ చేయాలన్నారు. 10,15 సంవత్సరాలు వాచ్ మెన్స్ గా చేసి షిఫ్ట్ అపరేటర్లుగా చేరిన కార్మికులకు పాత ఆపరేటర్ల వేతనాలు చెలించాలని, పీసురేటు కార్మికులైన మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీస్, బిల్ కలక్షన్ ఏజంట్స్ లకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న కారుణ్యానియామకాలు జరపాలని, నూతనంగా చేరిన కార్మికులుకు పాత కార్మికులతో సమానంగా వేతనాలు చెలించాలన్నారు. అర్హులైన కార్మికులకు షిఫ్ట్ ఆపరేటర్ పోస్ట్‌లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

భారీ స్కోరు సాధించిన కడప జట్టు

తలపడుతున్న నెల్లూరు, కర్నూలు జట్లు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిఎ సౌత్ జోన్ అండర్ - 19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 89.2 ఓవర్లలో 399 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఏ. నాగ కుల్లాయప్ప బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 182 బంతులను ఎదుర్కొని 17 బౌండరీలు సహాయంతో 101 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. ఏ. సాయి ఆర్థిత్ రెడ్డి 60 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 4, ధనుష్ రెడ్డి 2, తేజేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో నెల్లూరు కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 362 పరుగుల భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 86, కారుణ్య ప్రసాద్ 78, చైతన్య తేజ 62 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని రేవంత్ వికెట్లు తీసుకున్నాడు.

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన అండర్ -14, అండర్ -16 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన లభించింది. అండర్-14 జిల్లా జట్టు ఎంపికలకు 300 మందికి పైగా హాజరయ్యారు. ఆర్డర్ -16 జట్టు ఎంపికలకు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్ '14 అండర్ -16 జిల్లా జట్ల ఎంపికలకు హాజరై ప్రతిభ కనబరిచిన వారిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసి మ్యాచ్లు నిర్వహించిన అనంతరం అందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు.

నీటి వాటాల గురించి వివరిస్తున్న పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

కృష్ణానది బోర్డును ఎపికి తరలించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో సెక్షన్ 85, సబ్ సెక్షన్ 1 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల్లోపు కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని, కానీ 11ఏళ్లు అయినా తెలంగాణ రాష్ట్రం హైదరా బాద్‌లో ఉండడం శోచనీయమన్నారు. ఈ కార్యాలయాన్ని ఎపిలోని శ్రీశైలం, కర్నూలులోగాని ఏర్పాటు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోర్డుపై 27వ తేదీన జరిగే సమావేశంలో ఒత్తిడి చేయాలని సూచించారు. ఎగువ ఉన్న తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 90 టిఎంసీలు ఎత్తిపోసే విధంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 30 టిఎంసిలు ఎత్తిపోసే విధంగా డిండి ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర జల సంఘం, కృష్ణానది యాజమాన్య బోర్డు అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేవని చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే దిగువ ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్, వెలిగొండ, హంద్రీ నీవా, తెలుగుగంగ, గాలేరు - నగరి ప్రాజెక్టులకు నీరు అందక 48 లక్షల ఎకరాల సాగు భూమి బీడుగా మారుతుందని పేర్కొన్నారు. తాగునీటికి కటకట ఏర్పడుతుందని పేర్కొ న్నారు. పరిశ్రమలకు నీరు అందదని వివరించారు. తెలంగాణ అక్రమ ప్రాజె క్టులను అడ్డుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా కృషి చేయాలని తులసిరెడ్డి కోరారు.

26 నుంచి గురుకులంలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-రామాపురం

ఈనెల 26,27న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి మిగిలి ఉన్న సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డిసిఒ ఉదయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కడపలోని చిన్నచౌకులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠ శాల కళాశాలలో 26న 5వ తరగతిలో మిగిలిన సీట్లకు, 27న ఇంటర్‌లో మిగి లిన సీట్లకు ఉదయం తొమ్మిది గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలి పారు. రామాపురం గురుకుల పాఠశాల పాఠశాల, కళాశాలలో అర్హత పరీక్ష రాసిన ఆసక్తి కలిగిన విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా మాతమ్మ తిరుణాల

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని పివిజి పల్లె పంచాయతీ కొండంపల్లి గ్రామంలో మాతమ్మ తల్లి తిరుణాల ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాతమ్మ, మారమ్మ తల్లిని ప్రత్యే కంగా అలంకరించి అభిషేకాలు అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతమ్మ తల్లిని దర్శించుకోవడానికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి సైతం భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు పొంగువాళ్ళ పెట్టి మాతమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అర్చ కులు రామకృష్ణ, భక్తులు వెలగచర్ల శివశంకర్, కోటేశ్వ రరావు మాట్లాడుతూ తిరుణాలను వైభంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా నాగభూషణం

ప్రజాశక్తి-వీరబల్లి

వైసిపి రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా మోడం నాగభూషణం నియమితులయ్యారు. వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయంలో నియామక ఉత్త ర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ తనకు పదవి లభించడంపై వై.ఎస్.జగన్‌కు తెలిపారు. పదవి రావడానికి సహకరించిన వైసిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డికి, పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డికి, మాజీ ఎంపిపి భాస్కర్ రెడ్డికి, రాష్ట్ర ఎంపిపి సంఘం ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్ రెడ్డికి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి వీరనాగిరెడ్డికి, రాజంపేట నియోజకవర్గ యువ నాయకులు మదన్ రెడ్డికి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వివేక్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో చేనేత విభాగాన్ని పటిష్టం చేస్తానని అన్నారు. అధినేత ఆదేశానుసారం కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తీసుకెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రానున్న ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా చేనేత విభాగం పనిచేస్తుందన్నారు. ఆయన వెంట మండల వైసిపి అధ్యక్షులు జగదీశ్వర్‌రాజు, మండల ఉపాధ్యక్షుడు నరేంద్రనాయుడు, కుమార్‌నాయుడు, రాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ప్రకటించనున్న అర్హుల జాబితా..!

-30 నుంచి ట్రిపుల్‌ఐటిలో కౌన్సెలింగ్

-జులై 14 నుంచి తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలకు ఈ నెల 30 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటిల్లో అడ్మిషన్లు ఇచ్చేందుకు ఎంపికైన అర్హుల జాబితా ఈ నెల 23న విడుదల కానుంది. అడ్మిషన్లుకు సంబంధించి ఈ నెల 30, జులై 1న ఇడుపులపాయకి ఎంపికైన విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో కౌన్సెలింగ్ ఉంటుంది. అదేరోజు నూజివీడుకు ఎంపికైన వారికి కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూలై 2, 3 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులకు నూజివీడులో, జూలై 4,5 తేదీల్లో ఒంగోలు ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్‌ఐటిలో కౌన్సెలింగ్ ఉంటుంది. ఒంగోలు ట్రిపుల్‌ఐటికి భవనాలు లేకపోవడంతో పీయూసీ రెండేళ్ల కోర్సును ఇడుపులపాయలో, బిటెక్ నాలుగేళ్ల కోర్సును ఒంగోలులోని అద్దె భవనాల్లో నిర్వహిస్తారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తర్వాత విద్యార్థులు జూలై 14న ఆయా క్యాంపస్‌ల్లోకి చేరుకోవాల్సి ఉం టుంది. అదేరోజే తరగతులు ప్రారంభమవుతాయి. నాలుగు ట్రిపుల్‌ఐటిలకు ఎంపికైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సమయంలో 10 రకాల ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. పదవ తరగతి మార్కుల జాబితా, హాల్ టికెట్, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, టిసి, రేషన్‌కార్డు, స్పెషల్ కేటగిరీ అయితే అందుకు సంబంధించిన ధ్రువపత్రం, నివాస ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి రెండు సెట్లను అధికారులకు ఇవ్వాల్సి ఉంది. ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులు పీయూసీకి సంబంధించి మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.45 వేలు, ఇంజనీరింగ్‌కు సంబంధించి ఏడాదికి రూ.50 వేల చొప్పున 4 సంవత్సరాలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతోపాటు వసతి గృహ రుసుం కింద అదనంగా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. సూపర్ న్యూమరరీ కోటా కింద సీట్లు దక్కిం చుకున్న విద్యార్థులు ఏడాదికి ట్యూషన్ ఫీజు కింద రూ.1.50లక్షలతోపాటు అదనంగా వసతి గృహ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను పాటిమీదపల్లెకు చెందిన వైసిపి బిసి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన సుబ్బరాయుడు యాదవ్, ఆ పార్టీ బిసి సంఘం నాయకులు నేట్లపల్లి శివరాం ఆదివారం కలిశారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్సీ నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తన నియామకానికి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఎంతగానో కృషి చేశారని సుబ్బరాయుడు యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా యాక్టివిటీ మెంబర్ ముత్తూరు చిన్న వెంకటసుబ్బయ్య, బత్తల నాగమల్లేష్ యాదవ్, చిట్టిబోయిన గోపాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కుల ఉన్మాదులను గుర్తించి అరెస్టు చేయాలని అఖిలభారత్ మాల సంఘాల జెఎసి యువనాయకుడు మలతోటి నరేష్ అన్నారు. ఆదివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఖండించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెవిపల్లి మండలం, గర్నిమిట్ట పంచాయతీ, మల్లారపువాండ్ల పల్లె సమీపంలో నల్లగుట్ట క్రాస్ వద్ద గత ప్రభుత్వంలో దళితులకు ఇండ్ల నిర్మాణం కొరకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయడంతో కొంతమంది దళితులు ఇంటి నిర్మాణం కోసం పునాదులు వేసి ఆ కాలనీ ఆవరణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి గత మూడు సంవత్సరాల నుంచి అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేవారని, బుధవారం రాత్రి గుర్తుతెలియని కుల ఉన్మాదులు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా అంబేద్కర్ విగ్రహం చూపుడువేలును కొంతమంది దుండగులు ధ్వంసం చేసిన సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. వెంటనే దోషులను గుర్తించి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం స్థానంలో కొత్త అంబేద్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలని లేనిపక్షంలో త్వరలో రాష్ట్రస్థాయిలో ఉన్న కుల సంఘాల నాయకులతో సంప్రదించి చలో కెవిపల్లి పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలభారత మాల సంఘాల జెఎసి నాయకులు గుర్రం నారాయణ, నక్క వెంకట్ రమణ, బి.దామోదరం, జి సురేంద్ర, కోటపాటి రెడ్డమ్మ, ఊటుపల్లి రమణ, కొప్పు గంగులమ్మ, రామకృష్ణ, పాటూరు దామోదరం, రామమూర్తి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం :ఎంపీ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ప్రతి వైసిపి కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటా మని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉద యం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొర ముట్ల శ్రీనివాసులు, వైఎస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైసిపి జిల్లా యూత్ అధ్యక్షులు వెలగచర్ల శివారెడ్డి ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఎలాంటి సమస్యలు వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించే బాధ్యత తాను చూసుకుం టానని అన్నారు. కూటమి ప్రభుత్వం బెదిరింపులకు భయపడేది లేదని ఆయన హెచ్చరించారు. ఎంపీని కలసిన వారిలో కొర్రెడ్డి సిద్దయ్య, కొప్పల శంకరయ్య, రమేష్, డమ్ము రఘు,సుబ్బారెడ్డి, రాజేశ్వరి, అరుణ ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డితో కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పంద న లభించింది. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ స్థానిక విశ్వజ్యోతి హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి మహిళల పెద్ద సంఖ్యలో వచ్చి వైద్య సేవలను పొందినట్లు శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్టీ డాక్టర్.పి.వి.బ్రహ్మ రెడ్డి తెలిపారు.ఈ శిబిరాన్ని శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో నిర్వహించినట్లు తెలిపారు.ఈ శిబిరంలో గర్భాశయ వ్యాధులతో బాధపడుతున్న మహిళలకు వైద్య పరీక్షలను తిరుపతి పట్టణానికి చెందిన మెడిగో వైద్యశాలకు చెందిన గర్భకోశ వ్యాధి నిపుణులచే వైద్య సేవలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ శిబిరానికి మండలం నుంచి 128 మంది మహిళలు హాజరు కాగా వారిలో 50 మంది మహిళలకు ఉచితంగా పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో సంతోషదాయంగా ఉందని గ్రామస్తులు తమ హర్షం వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ప్రధానోపాధ్యాయులు ఎ. శ్రీనివాసులు రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశి కుమార్ రెడ్డి,డాక్టర్ జిలాని, షబ్బీర్, బాషా, నర్సులు, మహిళలు పాల్గొన్నారు.

నందలూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి సమీపంలో రాజంపేట పట్టణానికి చెందిన డాక్టర్ కృష్ణాస్ లైఫ్ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 150మంది రోగులకు బిపి, షుగర్, ఇతర రక్త పరీక్షలు నిర్వహిం చడంతోపాటు మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకృష్ణ మాలేపాటి మాట్లాడుతూ తమ వద్ద అన్ని రకముల ఎండోస్కోపిక్, ల్యాపరోస్కోపిక్, చెవి, ముక్కు, గొంతు, కోత కుట్టు లేని ఆపరేషన్లు చేయబడును అని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి. విన్య, డాక్టర్ సోహెల్, మాజీ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మాజీ ఎంపిపి పల్లె సుబ్రహ్మణ్యం, రాజంపేట వ్యవసాయ మార్కెట్ మాజీ అధ్యక్షులు ఎద్దుల విజయసాగర్, ఉప్పు శెట్టి రెడ్డయ్య, ఉప్పు శెట్టి సుధీర్, మోడపోతుల రాము, చక్రాల సాయినాథ్, రోగులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి 160 మంది హాజరు

కలకడ: ఉచిత కంటి వైద్య శిబిరానికి 160 మంది హాజరైనట్లు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు పివి.నాయుడు తెలిపారు.ఆదివారం మండలంలోని బాటవారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో తిరుపతి పట్టణానికి చెందిన ఎస్‌వి.అరవింద కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.ఈ శిబిరానికి 160 మందికి కంటికి సంబంధించిన జబ్బులు గలవారు హాజరుకాగా వారిలో 41 మంది కంటి ఆపరేషన్ చేసినట్లు వైద్య అధికారులు లక్ష్మీ, శిరీష, సుధాకర్ తెలిపారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని ఉచితంగా బస్సు, భోజనం, ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆపరేషన్ అనంతరం వారిని తిరిగి ఉచిత వాహనముల ద్వారా చేర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గౌరీ శంకర్, మానవత సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గంగాధర నాయుడు.సుధాకర, వై.వి.రమణ, పి.వి.రమణ, భాను ప్రకాష్ నాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వ రరావు, డాక్టర్ కుప్పస్వామి, ఎస్వీ అరవింద కంటి వైద్యశాల నుండి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

'సూర్యఘర్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పులివెందులరూరల్

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను ప్రతి విద్యుత్ విని యోగదారుడూ వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ డిఇ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో ఆదివారం ప్రజాకళా వేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఇ మాట్లాడుతూ రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లును కూడా ఆదా చేసు కోవచ్చని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనకు దరఖాస్తు చేసు కోవాలంటే సుమారు రూ.2లక్షలు ఖర్చు అవుతుందని, ఇందులో రూ.78,000 ప్రభుత్వ రాయితీ ఇస్తుందన్నారు. బీసీలకు రూ.20వేలు రాయితీ అందుతుందన్నారు. మిగతావారు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణాలు అందిస్తాయని తెలిపారు. ఉచిత సూర్యకాంతిని సద్వినియోగం చేసుకోని విద్యుత్తు బిల్లును కూడా తగ్గించుకోవచ్చని సూచించారు. రూఫ్ ఆఫ్ టాప్ సోలార్ పవర్ టెక్నికల్ నెట్ మీటరింగ్ సిస్టం ద్వారా కరెంట్ బిల్లు సుమారు 90 శాతం తగ్గిం చుకోవచ్చని, సోలార్ ఉపయోగించడం వలన బొగ్గు ఆధారిత విద్యుత్తు తగ్గు తుందని తెలిపారు. తద్వారా సహజ వనరులను భావితరాలకు పొదుపు చేసిన వాళ్లమవుతామన్నారు. వాతావరణ కాలుష్యం కూడా తగ్గు తుందన్నారు. సౌరశక్తి నిరంతరం ఉత్పత్తి అయ్యే శక్తి.. నిర్వహణ ఖర్చు చాలా తక్కువ అవుతుందన్నారు. ప్రారంభంలో పెట్టుబడి మాత్రం ఉంటుందని తెలిపారు. సోలార్ అన్‌గ్రేడ్ నెట్ ద్వారా వ్యాపార రీత్యా ఇన్‌స్టాల్ చేసుకున్న వారికి రాయితీ లేదని, మీ పెట్టుబడిని 40 సంవత్సరాల లోపు తిరిగి పొంద వచ్చని సోలార్ అన్‌గ్రిడ్ సిస్టం ద్వారా మనం ఉపయోగించగా మిగిలిన విద్యుత్తును ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌కు సోలార్ ప్యానల్స్ ఉపయోగపడుతుందని వివరించారు. దీని జీవితకాలం సుమారు 25 ఏళ్ల ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఇలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇ ప్రసాద్‌రెడ్డి

కొండెక్కిన కాంచరకాయలు

వర్షాభావంతో తగ్గిన దిగుబడి - కిలో రూ.200-విస్తుపోతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రుతుపవనాలు వచ్చి వర్షాలు పడడంతో ఇతర జిల్లాల నుండి కాంచర కాయలు పులివెందులకు వచ్చేశాయి. కాంచరకాయల ధరలు కొండెక్కాయి ఇప్పుడిప్పుడే అవి మార్కెట్‌లోకి వస్తుండడంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చికెన్ ధరకు సమానంగా సరితూగుతున్నాయి. ప్రస్తుతం వీటిని కిలో రూ,200 చొప్పున విక్రయిస్తున్నారు. కాల్‌కిలో (250గ్రాములు) రూ.60 చొప్పున అమ్ముతున్నారు.కిలో తీసుకుంటే రూ.200కు ఇస్తున్నారు. వర్షభావం వల్ల ఈ ప్రాంతంలో కాంచరకాయలు లభించలేదు. ప్రస్తుతం వీటిని వ్యాపారస్తులు అనంతపురం జిల్లా తాడిపత్రి, గుత్తి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు. రవాణా ఛార్జీలు విపరీతంగా పెరగడం వల్ల కాంచర కాయల ధరలు కూడా పెంచాల్సి వస్తోందని వ్యాపారులు మొహమాటం లేకుండా చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే కాయలు రావడం మొదలవుతుంది. ము ఖ్యంగా వేరుశనగ పంటలో వీటి ఉత్పత్తి కనిపిస్తుంది. తొలకరి చినుకుల అనంతరం జూన్, జులై నెలలో వీటి ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. కాల క్రమైనా వివిధ కారణాల వల్ల ఖరీఫ్‌లో ప్రధానంగా సాగు చేసే వేరుశనగ పంట విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో కాంచర కాయల ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. కాంచర కాయలు కూడా ఆరోగ్యానికి మిక్కిలి ఉప యోగపడతాయి. వీటిలో కాస్త చేదు, వగరు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ వీటిని తినడానికి ఇష్టప డతారు. కాంచర కాయలను చూస్తే ప్రతి ఒక్కరికి నోరూ రిస్తుంది. సీజన్ సమ యంలో వీటిని కొనుగోలు చేసి బాగా ఎండబెట్టిన తర్వాత నిల్వ ఉంచుకొని తింటారు. వీటి ధర ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య, సామాన్య తరగతి ప్రజలకు రుచింపలేదు. అయితే ఇప్పుడిప్పుడే ఇవి మార్కెట్లోకి రావడం వల్ల వీటి ధరలు ఎక్కువగా ఉన్నా యని, కొన్నాళ్ల గడిస్తే తగ్గుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. వర్షాభావ పరిస్థి తుల వల్ల కాంచర కాయల కొరత కనిపిస్తోంది. రుతుపవనాల ప్రభావం ఇతర ప్రాం తాల్లో ఉన్నా ఈ ప్రాంతంలో మాత్రం తక్కువగా ఉంది. ఈపాటికి పదును వర్షాలు వచ్చి ఉంటే కాంచర కాయలు కూడా విరివిగా లభ్యమ య్యేవి. రుతుపవనాల ప్రభావం కాంచర కాయలపై పడిందని చెప్పవచ్చు.

కాంచర కాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు

టిడిపి మండల అధ్యక్షులుగా ప్రభాకర్‌నాయుడు

ప్రజాశక్తి-కలకడ

ప్రభాకర్ నాయుడు, బరకం శ్రీనివాసులురెడ్డి

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా పొతూరి ప్రభాకర్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సమక్షంలో కలికిరిలో జరిగిన పార్టీ అధ్యక్షులుగా పొత్తూరి ప్రభాకర్ నాయుడు, తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ కన్వీనర్ గా బరకం శ్రీనివాసులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలోని టిడిపి కార్యకర్తలు , అభిమానులు ఏక నిర్ణయం అభిప్రాయ సేకరణతో రెండవ సారి కూడా మండల పార్టీ అధ్యక్షులుగా ప్రభాకర్ నాయుడు, క్లస్టర్ కన్వీనర్ గా బరకం శ్రీనివాసులు రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. రెండవసారి తిరిగి మా ఇరువురిని ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యేకు ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు. మాకు ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మండల యూనిట్ కన్వీనర్లుగా కలకడకు వై.జిల్లానిబాషా, బాలయ్యగారిపల్లెకు ఆర్.ఈశ్వరయ్య, బాటవారిపల్లెకు ఎస్.వెంకటరత్నం, రాతిగుంటపల్లికు పి.వి.నాయుడు, దేవులపల్లికు మల్లికార్జున నాయుడు, కోనకు త్యాగరాజు, కదిరాయచెరువుకు గంట.శ్రీనివాసులు, నవాబుపేటకు వాటర్ షెడ్.రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులు కోసం నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండల పరిధిలోని రైతులు పచ్చిరొట్ట విత్తనాలు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి తెలిపారు. మండలానికి 100 క్వింటాలు జీలగలు కేటాయిం చారన్నారు. జీలగలు పూర్తి ధర రూ.1,230(10కిలోలు) రాయితీ ధర రూ.615 (10కేజీ)రైతు వాటా రూ.615 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సోమ వారం నుండి రైతు నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. సోమవారం ఎస్. మైదుకూరు రెవెన్యూ గ్రామాల రైతులు నమోదు ప్రక్రియకు రావాలని ఆయన సూచించారు. అన్నలూరు, శివపురం రైతులు వారి రైతు సేవ కేంద్రంలో నమోదు చేయించు కోవాలని తెలిపారు. రైతులు వచ్చేటప్పుడు పట్టాదారు పాస్ బుక్,1-బి జిరాక్స్, సెల్‌ఫోన్ నెంబర్ తీసుకొని రావాలని సూచించారు.

దువ్వూరు : మొదటి విడతలో భాగంగా సోమవారం నుంచి రైతులకు రాయితీతో జీలుగలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రైతు సేవా కేంద్రం పరిధిలోని చింతకుంట-1, చింతకుంట-2, అన్న పుశాస్త్రపల్లి, ఎం.ఎర్రబెల్లి గ్రామాల పరిధిలో ఉన్న మాచనపల్లి, గోపులాపురం, బల్లకివారిపల్లి గ్రామాలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాఠశాల అభివృద్ధికి పారిశ్రామిక వేత్త రాజగోపాల్‌రెడ్డి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - లింగాల

తాము చదివిన పాఠశాలలో అప్పటి జ్ఞాపకాలు, బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ పెద్దకుడాల జిల్లా పరిషత్ హైస్కూలు 1984-85 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజగోపాలరెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి ఎద్దు మృతి

ప్రజాశక్తి - వేముల

కలుషిత నీరు తాగి గొందిపల్లె గ్రామానికి చెందిన రైతు డి.శేఖర్‌రెడ్డి ఎద్దు మృతి చెందింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పొలం దగ్గర ఎద్దు గెట్టున మేస్తూ.. డమ్ములో రసా యనాలతో కలిపిన నీటిని ఎద్దు తాగడంతో కొద్దిసేపటికి అది నేలపడిపోయింది. ఎద్దు విలువ రూ.80వేలు అని బాధిత రైతు వాపోయాడు. తాను వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నానని, ప్రభుత్వం ఆదుకోవాలని శేఖర్‌రెడ్డి వేడుకుంటున్నాడు.

క్రైం కార్నర్

రోటావేటర్ యంత్రంలో పడి రైతుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పొలాన్ని చదును చేసే రోటోవేటర్ యంత్రంలో పడి రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బాధిత రైతు కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలం లోని కొత్తపల్లి కి చెందిన రైతు బయ్యారెడ్డి రోటావేటర్ యంత్రంతో పొలాన్ని చదును చేస్తున్నాడు. ఈ సమయంలో యంత్రాన్ని ఆపి చెత్త తీస్తుండగా పొరపాటున యంత్రం ముందుకెళ్ళింది. దీంతో రైతు కాలు అందులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కాలు తీసేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగు ళూరుకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

-ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రామసముద్రం

లక్ష్మి నరసమ్మ(ఫైల్ ఫొటో)

గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. వివరాల్లోకెళ్తే మండలంలోని చెంబకూరు నుండి మదనపల్లి మార్గంలోని బలిజపల్లె వద్ద గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొని శనివారం రాత్రి దిగువపల్లెకు చెందిన ఎం. లక్ష్మీనరసమ్మ(65) మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రం గా గాయపడ్డారు. చంబకూరు పంచాయతి బలిజపల్లి ఎసి గోడౌన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. దిగువపల్లెకు చెందిన నారాయణస్వామి భార్య లక్ష్మీనరసమ్మ అదే గ్రామానికి చెందిన కృష్ణమ్మ, శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి మృతురాలు కుమారునికి సమాచారం అందిం చారు. ఓ ప్రయివేట్ వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే లక్ష్మీనరసమ్మ మృతి చెందినట్లు తెలిపారు. మిగిలిన ఇద్దరిలో కృష్ణమ్మ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రూయాకు తరలించి అక్కడ నుంచి వేలూరు సిఎంసి కి తరలించారు. ఈ ఘటనపై గణేష్ బాబు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ప్రియుడు

-అవమానంతో ఆత్మహత్యకు యత్నించిన యువతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేయడంతో ప్రియుడు చేసిన మోసానికి మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లిలో జరిగింది.బాధితురాలి కుటుంబీకుల కథనం మేరకు..స్థానిక గొల్లపల్లిలో ఉండే ఆంజప్ప కొడుకు మహేంద్ర తన ఇంటిలో అద్దెకు ఉంటున్న ఆటో డ్రైవర్ రెడ్డప్ప కుమార్తె శృతి (20) ని ప్రేమ పేరుతో దగ్గర చేసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఏడేళ్ల పాటు సహజీవనం చేశాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పాడు. దీంతో తనే సర్వస్వం అనుకొన్న శృతి తట్టుకోలేక పోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తన బతుకు ఛిద్రంగా మారడంతో తనకు చావే శరణ్య మనుకుంది. దగ్గరలో ఉన్న అంగడికి వెళ్లి రిల్లలు, చీమల్ని చంపడానికి ఉపయోగించే లక్ష్మణ రేఖలు తెచ్చి పొడి చేసుకుని, ఆ పొడిని నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించింది. తీవ్ర కడుపు నొప్పితో కొట్టు మిట్టాడు తుండగా కుటుంబీకులు గమనించి బాధితురాలని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, మెరుగైన వైద్యం అందిం చడంతో కోలుకుంటోంది. జరిగిన మోసాన్ని తలుచుకుని కుమిలిపోతూ తనకు న్యాయం చేయాలని చేతులు జోడించి ప్రాధేయ పడుతోంది. తల్లిదండ్రులు సైతం తమ బిడ్డకు న్యాయం చేయాలని పోలీసులను అర్థిస్తున్నారు. ఈ సంఘ టనపై పోలీసులు విచారిస్తున్నారు.